www.prajasakti.com

ప్రజాశక్తి

ఆదివారం 28 సెప్టెంబరు 2025 | 5 | పశ్చిమ గోదావరి

కేసుల విచారణను వేగవంతం చేయాలి : కలెక్టర్

భీమవరం : కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లా స్థాయి విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశంలో ఎస్సి, ఎస్టి అట్రాసిటీ కేసులపై జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి సంబంధిత అధికారులతో గూగుల్ మీట్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎస్సి, ఎస్టిలపై జరిగిన దాడులకు సంబంధించి నమోదైన కేసులపై విచారణ వేగవంతం చేయాలన్నారు. పరిహారం చెల్లించేందుకు తహశీల్దార్లు సంబంధిత ధ్రువపత్రాలను త్వరితగతిన పంపించాలన్నారు. 2023 - 24 సంవత్సరానికి 35 కేసులకు సంబంధించి రూ.48 లక్షలు బాధితులకు పరిహారం అందించడం జరిగిందన్నారు. ఈ సంవత్సరం మే, 2025 నుండి ఇప్పటివరకు 11 కేసులు నమోదయ్యాయని బాధితులకు పరిహారం చెల్లించేందుకు ప్రాసెస్ జరుగుతుందన్నారు. ఈ గూగుల్ మీట్‌లో ఎస్పి అద్నాన్ నయీం అస్మి, డిఆర్ఒ బి.శివన్నారాయణ రెడ్డి, జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి ఎన్‌వి.అరుణ కుమారి, రెవెన్యూ డివిజనల్ అధికారులు, డిఎస్‌పిలు, పబ్లిక్ ప్రాసిక్యూటర్ పాల్గొన్నారు.

డిపిఒకు వినతిపత్రం అందజేస్తున్న పంచాయతీ కార్యదర్శులు

పని ఒత్తిడి తగ్గించండి

డిపిఒకు పంచాయతీ కార్యదర్శుల వినతి

ప్రజాశక్తి - భీమవరం

వివిధ రకాల సర్వేలు, ఆన్‌లైన్, ఆఫ్ లైన్ సమావేశాలతో సతమతమవుతున్నామని, తమకు పని ఒత్తిడి తగ్గించాలంటూ జిల్లా పంచాయతీ కార్యదర్శులు ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక కలెక్టరేట్లో జిల్లా పంచాయతీ అధికారి రామ్‌నాథ్ రెడ్డికి జిల్లా పంచాయతీ కార్యదర్శుల సంఘం శనివారం వినతి పత్రాన్ని అందజేసింది. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శులు మాట్లాడుతూ పంచాయతీరాజ్ శాఖ పనులతో పాటు గ్రామ వార్డు సచివాలయ పనులు కూడా ఏకకాలంలో నిర్వహించడం వల్ల అధిక పని ఒత్తిడికి గురికావడమే కాకుండా వ్యక్తిగత కుటుంబ జీవితానికి దూరం అవుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళా కార్యదర్శుల పరిస్థితి మరింత దయనీయంగా మారిందన్నారు. దీనిపై స్పందించిన డిపిఒ రామనాథరెడ్డి మాట్లాడుతూ కార్యదర్శులకు పని ఒత్తిడి తగ్గించేందుకు తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

విద్యాహక్కు చట్టానికి తూట్లు

- ప్రభుత్వ విద్యాసంస్థల్లో సౌకర్యాలు కల్పించని కూటమి ప్రభుత్వం
- విద్యార్థినుల పట్ల వివక్ష తగదు
- సమస్యల పరిష్కారానికి ఎస్‌ఎఫ్‌ఐ నిరంతర పోరు
- విద్యార్థినుల రాష్ట్రస్థాయి కన్వెన్షన్‌లో నేతలు
- ముగింపు సందర్భంగా పట్టణంలో భారీ ప్రదర్శన

ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యాన ప్రదర్శన

ప్రజాశక్తి - భీమవరం

ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేయాల్సిన కూటమి ప్రభుత్వం ప్రయివేటీకరణకు మొగ్గు చూపుతోంది. విద్యాహక్కు చట్టానికి పూర్తిగా తూట్లు పొడిచి నిర్వీర్యం చేసేందుకు ప్రయత్నిస్తోంది. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో కనీస సౌకర్యాలు కూడా కల్పించలేని దుస్థితి క్షేత్రస్థాయిలో కన్పిస్తోంది. మరుగుదొడ్లు, తాగునీరు వంటి సౌకర్యాలు కూడా కల్పించలేని పరిస్థితుల్లో పాలకులు ఉన్నారు. ఒకవైపు నాణ్యమైన విద్య అందక, మరోవైపు కనీస సౌకర్యాలు లేక విద్యార్థులు ప్రభుత్వ విద్యకు దూరమవుతున్నారు. ఈ పరిస్థితుల్లో పోరాటాల ద్వారానే సమస్యలు పరిష్కారమవుతాయని ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర విద్యార్థినుల కన్వెన్షన్ పిలుపునిచ్చింది. సమస్యలతో సతమతమవుతున్న విద్యార్థులను సంఘటిత పర్చి కదంతొక్కుతామని ప్రకటించింది. సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీసేందుకు కార్యాచరణ రూపొందించింది. ముఖ్యంగా అనేక రూపాల్లో నిరంతరం వివక్షకు గురవుతున్న విద్యార్థినులు కష్టాలపై విద్యార్థినుల కన్వెన్షన్ గళమెత్తింది. రాష్ట్రం నలుమూలల నుంచి వచ్చిన విద్యార్థి సంఘ నేతలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలను ఎండగట్టింది. ఈ సందర్భంగా ఎస్‌ఎఫ్‌ఐ ఆలిండియా సహాయ కార్యదర్శి ఐషీ ఘోష్, ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు రామ్మోహన్, ప్రసన్నకుమార్ మాట్లాడుతూ భవిష్యత్తు పోరాటాలపై విద్యార్థినులకు దిశానిర్దేశం చేశారు. అనంతరం రాష్ట్ర విద్యార్థినుల కన్వెన్షన్ ముగింపులో భాగంగా ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో భీమవరంలో భారీ ప్రదర్శన నిర్వహించారు. రాష్ట్రం నలుమూలల నుంచి విచ్చేసిన సుమారు 300 మంది విద్యార్థినులు, విద్యార్థి సంఘ నేతలు ప్రదర్శనలో పాల్గొన్నారు. పాత బస్టాండ్ సెంటర్లో ప్రారంభమైన ప్రదర్శన గాంధీ చౌక్, అంబేద్కర్ సెంటర్ మీదుగా ప్రకాశం చౌక్ వరకూ సాగింది. అక్కడ అల్లూరి సీతారామరాజు విగ్రహానికి ఎస్‌ఎఫ్‌ఐ ఆలిండియా సహాయ కార్యదర్శి ఐషీఘోష్, ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర కార్యదర్శి ప్రసన్నకుమార్ పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. అనంతరం పోలీస్ బొమ్మ సెంటర్, అన్నపూర్ణ థియేటర్ రోడ్డు, కొత్త బస్టాండ్ సెంటర్ మీదగా వీరమ్మ పార్క్ మీదుగా అంబేద్కర్ భవనం వరకు ప్రదర్శన సాగింది. ఈ నేపథ్యంలో ఈ కార్యక్రమాల్లో భాగస్వాములై భవిష్యత్ ఉద్యమాలకు రూపకల్పన చేసిన పలువురు విద్యార్థి నేతలను ప్రజాశక్తి పలుకరించింది. ఆ విషయాలు వారి మాటల్లోనే..

మహిళా చట్టాలను పటిష్టంగా అమలు చేయాలి

సిహెచ్.పావని, ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు

అధికారంలో ఉన్న నాయకులు తప్పు చేస్తే శిక్షించే పరిస్థితి లేదు. మహిళా చట్టాలన్నీ సామాన్యులకు ఒకలా, అధికార నాయకులకు మరోలా అమలు చేస్తున్నారు. అందరికీ చట్టాలు ఒకేలా అమలు చేసినప్పుడే సమాన న్యాయం అందుతుంది. అత్యా చారాలు, దాడులు ఆగాలంటే ప్రభుత్వంలో బిజెపి నాయకులు తప్పు చేస్తే వారిపైనా కచ్చితంగా చర్యలు తీసుకోవాలి. అలాంటిప్పుడే చట్టాలు అందరికీ సమానంగా అమలైనట్లు. తల్లిదండ్రులు కూడా పిల్లలను ఇంట్లో సమానత్వంతో చూడాలి. అది చదువులోనే కాదు.. జాగ్రత్తలు చెప్పే విషయంలోనూ పిల్లల్ని సమానంగా చూస్తేనే ఇటువంటి హత్యలు, అత్యాచారాలకు ఆడ పిల్లలు భయపడే పరిస్థితి ఉండదు. తల్లిదండ్రులు ఆడ పిల్లలను తక్కువ భావనతో చూడటం మానేసి మగ పిల్లలతో సమానంగా పెంచాలి.

గిరిజన బాలికల హాస్టళ్లలో మెరుగైన వసతులు కల్పించాలి

ఆర్.శిరీష, ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర కమిటీ సభ్యురాలు

శ్రీకాకుళం నుండి ఏలూరు వరకు గిరిజన ప్రాంతం విస్తరించి ఉంది. ఈ ప్రాం తాల్లో చదువుకునే విద్యార్థినుల సంఖ్య పెరు గుతుంది. వారి విద్య అవసరాలు తీర్చేం దుకు ప్రభుత్వం ఎక్కువ సంఖ్యలో విద్యాసం స్థలు నెల కొల్పాలి. వాటిలో మౌలిక సదుపాయాలన్నీ కల్పిం చాలి. విద్యార్థినుల సంఖ్యకు అనుగుణంగా హాస్టళ్లు లేకపో వడం గిరిజన విద్యార్థినుల దురదృష్టంగా భావించాలి. ప్రభుత్వం వసతి గృహాల్లో మౌలిక సదుపాయాలు కల్పించి, సిబ్బందిని నియమించాలి.

శానిటరీ నాప్కిన్స్ ప్రభుత్వం ఉచితంగా ఇవ్వాలి

నవిత, ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర కమిటీ సభ్యురాలు

రాష్ట్రంలో ప్రస్తుతం అందిస్తున్న శానిటరీ నాప్కిన్స్ నాణ్యత లేని పరిస్థితి ఉంది. దీంతో విద్యార్థినులు అనారోగ్య సమస్యలకు గురయ్యే అవకాశం ఉంది. ప్రభుత్వం దీన్ని దృష్టిలో పెట్టుకుని నాణ్యమైన శానిటరీ నాప్కిన్స్ అందజేయాలి. ఇది అన్నిచోట్లా అమలు చేయాలి. ప్రభుత్వం విద్యార్థినుల సమస్యలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుని పరిష్కారానికి కృషి చేయాలి.

పౌష్టికాహారం అందించాలి

జ్యోతి, ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర కమిటీ సభ్యురాలు

రాష్ట్రంలో అనేక హాస్టళ్లు అద్దె భవనాల్లో నడుస్తున్నాయి. దీనివల్ల మరుగుదొడ్ల వసతి సరిగా లేని పరిస్థితి. ఫలితంగా విద్యార్థినులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆడ పిల్లలకు పౌష్టికాహారం ఎంతో అవసరం. పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్ ఛార్జీలు లేకపోవడం వల్ల హాస్టళ్లలో పౌష్టికాహారం అందట్లేదు. దీంతో విద్యార్థినులు శారీరకంగా బలహీనపడుతున్నారు. విద్యార్థినుల ఆరోగ్యానికి పెద్దపీట వేసేలా పౌష్టికాహారం అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. అదే సమయంలో హాస్టళ్లలో సౌకర్యాలు కల్పనకు కృషి చేయాలి.

కొల్లేరుకు మోక్షం లేదా..!

- జూన్ 17,18 తేదీల్లో కేంద్ర సాధికారిక కమిటీ పర్యటన
- మూడు నెలలు దాటినా ఒక్క అడుగూ ముందుకు పడిన దాఖలాలు కరువు
- కొల్లేరు సమస్యను పరిష్కరిస్తున్నామంటూ కూటమి నేతలు హడావుడి
- శాశ్వత పరిష్కారం చూపాలంటూ కొల్లేరు ప్రజల వేడుకోలు
- గడిచిన 19 ఏళ్లుగా పాతపాటే పాడుతున్న ప్రభుత్వాలు



కొల్లేరులో సాధికారిక కమిటీ పర్యటన (ఫైల్)

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

కొల్లేరు సమస్యకు మోక్షం లభించేనా అంటూ అక్కడి ప్రజలు కళ్లకాయలు కాసేలా ఎదురుచూస్తున్నారు. రోజులు గడిచిపోతున్నా ప్రభుత్వం నుంచి ఉలుకుపలుకూ లేకపోవడంపై కొల్లేరు ప్రజలు తీవ్ర ఆవేదనకు గురవుతున్నారు. కూటమి ప్రభుత్వం కొల్లేరుకు శాశ్వత పరిష్కారం చూపిస్తుందని కొల్లేరు ప్రాంత ఎంఎల్‌ఎలు, ఎంపీ అక్కడి ప్రజల్లో ఆశలు రేపారు. జూన్ 17, 18 తేదీల్లో కేంద్ర సాధికారిక కమిటీ కొల్లేరులో పర్యటించింది. కొల్లేరులోని 120 గ్రామాల ప్రజలు సాధికారిక కమిటీని కలిసి తమగోడు విన్పించారు. కొల్లేరును మూడో కాంటూరుకు కుదించాలని, జిరాయతీ, సొసైటీ భూములను తిరిగి ఇవ్వాలని శాశ్వత పరిష్కారం చూపాలని వేడుకున్నారు. కూటమి ప్రజాప్రతినిధులు, ఇతర రాజకీయ పార్టీలు సైతం సాధికారిక కమిటీ సభ్యులకు కొల్లేరు సమస్యపై వినతులు అందించారు. రెండో రోజు జిల్లా కలెక్టరేట్‌లో కమిటీ నిర్వహించిన సమావేశానికి కొల్లేరు ప్రజలు పెద్దఎత్తున హాజరై తమ సమస్యలను వినతుల రూపంలో ఇచ్చారు. కొద్ది రోజుల్లోనే కొల్లేరు సమస్యకు పరిష్కారం దొరుకుతుందని కూటమి నేతలు ఊదరగొట్టారు. సాధికారిక కమిటీ పర్యటించి మూడు నెలలు దాటిపోయింది. ఇప్పటి వరకూ కొల్లేరు సమస్యపై ఒక్క అడుగూ ముందుకు పడిన దాఖలాలు లేవు. దీంతో గతంలో మాదిరిగానే ఇప్పుడు మోసపోయినట్లేనా అనే చర్చ కొల్లేరు ప్రజల్లో నడుస్తోంది. ఐదో కాంటూరు వరకూ ఉన్న కొల్లేరు సరస్సుకు సంబంధించి 77,138 ఎకరాల భూమి ఉంది. ఇందులో 14,932 ఎకరాలు జిరాయితీ భూమి, ఏడు వేల ఎకరాలు సొసైటీ భూములు ఉన్నాయి. 2006లో అప్పటి ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ కొల్లేరుతో 43,724 ఎకరాల పరిధిలోని 1,776 చేపల చెరువులను బాంబులు పెట్టి మరీ ధ్వంసం చేశారు. జిరాయితీ, సొసైటీ భూముల్లోని చెరువులను సైతం నాశనం చేశారు. కొల్లేరు ప్రాంతంలో 120 గ్రామాలు ఉండగా మూడు లక్షలకుపైగా జనాభా నివశిస్తున్నారు. బిసి, ఎస్‌సి సామాజిక తరగతికి చెందిన జనాభానే ఎక్కువ ఉన్నారు.

రోడ్డున పడ్డ కొల్లేరు ప్రజలు

ఆపరేషన్ కొల్లేరుతో అక్కడి ప్రజలు సర్వం కోల్పోయి రోడ్డున పడ్డారు. చేపల చెరువుల ధ్వంసంతో సాగు చేసుకునేందుకు భూమి లేక ఉపాధి కోల్పోయి బతుకుదెరువు కోల్పోయారు. కడుపు నింపుకునేందుకు కేరళ, తమిళనాడు, ముంబై వంటి రాష్ట్రాలకు వలస వెళ్లి చేపల వేట చేసుకుంటూ నెట్టుకొస్తున్నారు. కొల్లేరును మూడో కాంటూరుకు కుదించాలని, ఆ విధంగా చేస్తే 33,750 ఎకరాలు కొల్లేరు సరస్సుగా ఉంటుందని, మిగిలిన భూములను కొల్లేరు ప్రజలకు ఇవ్వాలని అక్కడి ప్రజలు 19 ఏళ్లుగా కోరుతున్నారు. ఎన్నికల సమయంలో ప్రధాన రాజకీయ పార్టీలు హామీలు ఇవ్వడం, గెలిచిన తర్వాత పట్టించుకోకపోవడం పరిపాటిగా మారిపోయింది. దీంతో కొల్లేరు ప్రజలు నానావస్థలు పడుతున్నారు. 2014-19లో టిడిపి, బిజెపి కలిసి ఎన్నికల్లో పోటీ చేశాయి. భీమవరంలో జరిగిన ఎన్నికల సభలో ప్రధాని మోడీ కొల్లేరును మూడో కాంటూరుకు కుదిస్తామని హామీ ఇచ్చారు. గెలిచిన తర్వాత సర్వేల పేరుతో హడావుడి చేశారు. ధ్వంసం చేసిన జిరాయితీ భూములను తిరిగిస్తామని నమ్మబలికారు. కొల్లేరును మూడో కాంటూరుకు కుదించాలని అసెంబ్లీలో తీర్మానం చేసి సైతం కేంద్రానికి పంపించారు. తర్వాత పట్టించుకున్న దాఖలాల్లేవు. 2019లో వచ్చిన వైసిపి ప్రభుత్వం కొల్లేరు గురించి పట్టించుకున్న పరిస్థితి లేదు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం కొల్లేరుకు శాశ్వత పరిష్కారం చూపుతామని హడావుడి చేస్తుందే తప్ప చర్యలు మాత్రం కన్పించడం లేదు. కొల్లేరులో అటవీశాఖ నిబంధనల పేరుతో తాగునీరు, రోడ్లు సైతం ప్రజలకు అందకుండా పోయాయి. కొల్లేరు ప్రజలను ఆదుకోవాలని అక్కడి ప్రజలు గగ్గోలు పెడుతున్నారు. 2014-19లో మాదిరిగానే హడావుడి చేసి వదిలేస్తారా.. కొల్లేరు సమస్యను కూటమి ప్రభుత్వం పరిష్కరిస్తుందా అనే చర్చ కొల్లేరువాసుల్లో నడుస్తోంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇప్పటికైనా త్వరితగతిన కొల్లేరు సమస్యను పరిష్కరించాలని అక్కడి ప్రజలు కోరుతున్నారు.

ఆక్వా యూనివర్సిటీ పనులను పూర్తి చేయాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్

ప్రజాశక్తి - నరసాపురం

ఆక్వా యూనివర్సిటీ నిర్మాణ పనులను పూర్తి చేసి కార్యకలాపాలను ప్రారంభించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్ కోరారు. గత ప్రభుత్వ హయాంలో ప్రారంభించిన ఆక్వా యూనివర్సిటీ నిర్మాణ పనులను శనివారం ఆ పార్టీ ప్రతినిధుల బృందం పరిశీలించింది. ఈ సందర్భంగా గోపాలన్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఆక్వా అభివృద్ధికి ఎంతో తోడ్పడే యూనివర్సిటీ నిర్మాణం పట్ల కూటమి ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణి అవలంబిస్తోందని విమర్శించారు. పనులు ప్రారంభించి మూడు సంవత్సరాలు దాటినా పునాది పనులు కూడా పూర్తి చేయకపోవడం సిగ్గుచేటని అన్నారు. విద్యార్థుల శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించడానికి, పరిశోధనలు నిర్వహించడానికి, తద్వారా ఆక్వా రంగం అభివృద్ధికి యూనివర్సిటీ ఆవశ్యకత ఎంతో దోహదపడుతుందన్నారు. ఆక్వా ఉత్పత్తులు, వాణిజ్యంలో కీలకంగా ఉన్న మన రాష్ట్రంలో, అందులో ఈ జిల్లాలో ఆక్వా యూనివర్సిటీ ఏర్పాటు ద్వారా మరింత అభివృద్ధి చెందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. యూనివర్సిటీ నిర్మాణం పూర్తి కాకపోవడం వల్ల మత్స్య కళాశాల విద్యార్థుల తరగతులను రెండేళ్లుగా తుపాను రక్షిత భవనంలో నిర్వహిస్తున్నారని తెలిపారు. ఇరుకు గదుల్లో చదువుకోవడం, హాస్టల్ సౌకర్యం లేకపోవడం వల్ల విద్యార్థులు నానావస్థలు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఆక్వా యూనివర్సిటీ నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేసి యూనివర్సిటీ కార్యకలాపాలు ప్రారంభించి, పరిశోధనలు, విద్యార్థుల తరగతులను అక్కడే నిర్వహించాలని అన్నారు. ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తే ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కవురు పెద్దిరాజు, పట్టణ కార్యదర్శి ముచ్చర్ల త్రిమూర్తులు, మండల కార్యదర్శి జల్లి రామ్మోహన్‌రావు, నేతలు గుబ్బల నాగేశ్వరరావు, బొక్కా శ్రీనివాసరావు, పిల్లి కామేశ్వరరావు, కవురు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఆక్వా యూనివర్సిటీ భవనాలు పరిశీలిస్తున్న సిపిఎం నాయకులు

జిఎస్‌టి తగ్గింపుపై ప్రచారం చేయాలి : కలెక్టర్

భీమవరం : జిఎస్‌టి తగ్గింపు ఫలాలు జిల్లాలో ప్రతి ఒక్కరికీ తెలిసేలా అధికారులు ప్రణాళికాబద్ధంగా విస్తృత ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్లో వాణిజ్యపన్నుల శాఖ ఆధ్వర్యంలో జిఎస్‌టి సంస్కరణల అమలులో భాగంగా వివిధ వ్యాపార రంగాలైన ఆటోమొబైల్స్, పౌల్ట్రీ, ఆక్వా, ట్రాన్స్‌పోర్ట్, కన్‌స్ట్రక్షన్స్, ఇన్సూరెన్స్, చాంబర్ ఆఫ్ కామర్స్, కిరాణా మర్చంట్ తదితర వ్యాపార సంస్థలు అసోసియేషన్స్ ప్రతినిధులు, జిల్లా అధికారులతో జిల్లా కలెక్టర్ నాగరాణి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన వస్తుసేవల పన్ను తగ్గింపు జిఎస్‌టి 2.0 ప్రయోజనాలపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించేందుకు జిల్లాలో ప్రత్యేక అవగాహన కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించేందుకు తమ వంతు సహకారం అందించాలని కోరారు. ఈ సమావేశంలో జెసి టి.రాహుల్ కుమార్ రెడ్డి, ఏలూరు డివిజన్ వాణిజ్య పన్నుల డిప్యూటీ కమిషనర్ కెపి శైలజ, డిపిఒ ఎం.రామనాథరెడ్డి, డిఇఒ ఇ.నారాయణ, డిఎంహెచ్ఒ జి.గీతాభాయి, జిల్లా వ్యవసాయాధికారి జెడ్. వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కలెక్టర్

50 కాసుల బంగారం, రూ.70 వేల నగదు అపహరణ

ప్రజాశక్తి - తణుకు

తణుకు పట్టణంలోని లయన్స్ క్లబ్ వెనుక వారణాసి వారి వీధిలో శనివారం తెల్లవారు జామున భారీ చోరీ జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం ఒంటరిగా నివాసం ఉంటున్న వృద్ధురాలిని చంపుతామని బెదిరించి సుమారు 50 కాసుల బంగారు ఆభరణాలు, రూ.70 వేల నగదును నలుగురు దుండగులు దొంగిలించారని తెలిపారు. బాధితురాలు తణుకు పట్టణంలో మాజీ వార్డు కౌన్సిలర్ వాకలపూడి వీరరాఘవులు(లేటు) భార్య వాకలపూడి కనకదుర్గ. తణుకు పట్టణ పోలీసులు వివరాలు సేకరించి దర్యాప్తు చేస్తున్నారు. ఈ కేసులో ఇద్దరు నిందితులను గుర్తించారు. దుండగులు ఇద్దరూ తెలుపు రంగు మారుతీ బ్రీజా లేదా హ్యుందాయ్ క్రేటా కారులో వచ్చి దొంగిలించారు. పోలీసుల దర్యాప్తులో భాగంగా

నిందితుల కోసం పోలీసుల గాలింపు

నిందితుడు నాగేంద్ర సహాని

ఉత్తరప్రదేశ్‌లోని మౌ జిల్లా, మధుబన్ గ్రామానికి చెందిన 32 సంవత్సరాల నాగేంద్ర సహాని, మహారాష్ట్ర కొల్హాపూర్‌కి చెందిన సందీప్ మీరారాయ్ అనే ఇద్దరు నిందితులను గుర్తించారు. నిందితులు దొంగిలించిన బంగారు ఆభరణాలు, డబ్బుతో సహా తెలుపు రంగు కారులో పారిపోయారు. నిందితుడు నాగేంద్ర సహాని ఫొటోను ప్రచురించడం జరిగింది. ఈ నిందితులు, అనుమానాస్పద వాహనం ఎక్కడైనా కనిపిస్తే వెంటనే ఎస్‌డిపిఒ తాడేపల్లిగూడెం(9154965933) లేదా తణుకు టౌన్ పోలీస్‌స్టేషన్(9440796640)కు సమాచారం అందించాలని పోలీసులు తెలిపారు. రాష్ట్రంలోని అన్ని పోలీస్‌స్టేషన్‌లకు, ప్రజలకు కూడా విజ్ఞప్తి చేశారు.

చోరీకి గురైన 207 ఫోన్లు స్వాధీనం : ఎస్‌పి

ప్రజాశక్తి - భీమవరం టౌన్

సుమారు రూ.35 లక్షల నగదు విలువగల 207 సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు జిల్లా ఎస్‌పి అద్నాన్ నయీం అస్మి తెలిపారు. శనివారం స్థానిక వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఎస్‌పి మాట్లాడుతూ ఉదయం 9 గంటలకు పట్టణంలోని జంక్షన్ రైల్వే స్టేషన్ నుండి పార్కింగ్ ఏరియా వద్ద వ్యక్తి అనుమానాస్పందంగా తిరుగుతున్నట్లు సమాచారం రావడంతో అతన్ని అదుపులోకి తీసుకుని విచారించగా అతడు ఆకివీడుకి చెందిన మేకల కిషోర్‌గా తెలిపాడన్నారు. అతని వద్దనున్న రెండు థర్మాకోల్ బాక్స్‌లు తనిఖీ చేయగా 207 సెల్ ఫోన్లు గుర్తించి స్వాధీనం చేసుకున్నామన్నారు. అతనితోపాటు ఆకివీడుకు చెందిన నాగులూరి పెద్దింట్లు, నక్క తరుణ్‌లు వివిధ ప్రాంతాల్లో సెల్ ఫోన్లు దొంగలించి వాటిని పశ్చిమ బెంగాల్‌కు చెందిన అబ్దుల్ అజీజ్‌కు రూ.5 వేలు చొప్పున విక్రయిస్తున్నట్లు తెలిపారు. సెల్ ఫోన్లు చోరీకి గురైనట్లయితే పోలీసులకు సమాచారం ఇవ్వాలని, దీని కోసం ఒక యాప్ కూడా తీసుకురావడం జరిగిందని ఎస్‌పి తెలిపారు. ఈ సమావేశంలో డిఎస్‌పి జై.సూర్య, సిఐ నాగరాజు, ఎస్ఐ వంశీ పాల్గొన్నారు.

అలజడి.. ఆందోళన..!

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలు తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. దీనికి నిదర్శనం ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల ప్రజల్లో ఈ కాలంలో ఆందోళనే. ఏజెన్సీలో నేవీ ఆయుధ డిపో, పోలవరం నిర్వాసితులకు భూసేకరణ, మెడికల్ కళాశాలల ప్రయివేటీకరణ అంశాలు రెండు జిల్లాల ప్రజల్లో కలకలం రేపుతున్నాయనడంలో ఎటువంటి సందేహమూ లేదు. ఆయా అంశాలపై ప్రజాందోళనలను అణచివేయడానికి ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు ఏరుదాటాక తెప్ప తగలేసిన చందంగా ఉందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

పశ్చిమ ఏజెన్సీ రాష్ట్రంలోనే అతి చిన్న ఐటిడిఎ పరిధి కలిగిన ప్రాంతం. అయితే ప్రాజెక్టు నిర్మాణంతో దీనిలో ఎక్కువ భాగం ముంపునకు గురవుతోంది. అక్కడి నిర్వాసితులకు సైతం ఇక్కడి ఏజెన్సీ ప్రాంతంలోనే పునరావాసం కల్పిస్తున్నారు. దీంతో అటవీ ప్రాంతం గణనీయంగా తగ్గిపోతుంది. ఈ క్రమంలో అటవీ విస్తీర్ణం పెంపునకు చర్యలు తీసుకోవాల్సిన పాలకులు, అధికారులు దానికి భిన్నంగా ఏజెన్సీలోనే ఆయుధ డిపో ఏర్పాటుకు ప్రయత్నించడం సర్వత్రా చర్చనీయాంశమైంది. ఎందుకంటే ప్రస్తుతం ఆయుధ డిపో ఏర్పాటుకు సుమారు వెయ్యి ఎకరాలకు పైగా భూసేకరణకు కసరత్తు ప్రారంభించారు. తర్వాత మరిన్ని అవసరాల రీత్యా మరికొంత భూమి కావాలని నేవీ అధికారులు కోరితే అక్కడే భూసేకరణ తప్పనిసరి. దీనివల్ల వంకావారిగూడెం పంచాయతీ పరిధిలోని పలు గ్రామాలు నిర్వాసిత గ్రామాలుగా మారనున్నాయి. ఆయుధ డిపో ఏర్పాటుతో గిరిజన ప్రాంతం అభివృద్ధి చెందుతుందని, ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని ఎంపీ, ఎంఎల్‌ఎ పదేపదే చెబుతున్నారు. ఇదే ఎంఎల్‌ఎ చిర్రి బాలరాజు గతంలో జనసేన నేతగా వైసిపి ప్రభుత్వ హయాంలో ఆయుధ డిపో ఏర్పాటు ప్రతిపాదనను వ్యతిరేకిస్తూ గళమెత్తారు. నాడు గ్రామసభ తీర్మానాల మేరకు వైసిపి ప్రభుత్వం ఆయుధ డిపో ఏర్పాటుపై వెనుకడుగు వేసింది. కూటమి అధికారం చేపట్టాక కూడా మరోసారి ఆయుధ డిపో ఏర్పాటు ప్రతిపాదన తెరపైకి రాగా గ్రామసభ ముచ్చటగా మూడోసారి ఆ ప్రతిపాదనను తిరస్కరిస్తూ తీర్మానం చేసింది. ఫలితంగా గిరిజనుల అభీష్టానికి భిన్నంగా ఎటువంటి నిర్ణయం తీసుకోబోమని నాడు ఎంపీ, ఎంఎల్‌ఎ స్వయంగా ప్రకటించారు కూడా. మళ్లీ హఠాత్తుగా నేవీ ఆయుధ డిపోను తెరపైకి తీసుకురావడమే కాక ఇదేమిటని ప్రశ్నించినా, ఆయుధ డిపో మాకొద్దు అని అధికారులకు వినతి ఇద్దామన్నా కుదరదంటూ పోలీసు నిర్బంధం ప్రయోగించడం గమనార్హం. మడకంవారిగూడెం నుంచి గిరిజనులు శాంతియుతంగా ర్యాలీ నిర్వహించి తహశీల్దార్‌కు వినతిపత్రం అందిద్దామంటే పోలీసులు ఆ గ్రామం దాటకుండానే అడుగడుగునా నిర్బంధం ప్రయోగించి బలప్రయోగానికి దిగారు. ర్యాలీ తహశీల్దార్ కార్యాలయం వరకూ వెళ్లనీయకుండా పోలీసులు అడ్డుకున్నారుగాని, గిరిజన మహిళల పోరాట పటిమ అందరిలో స్ఫూర్తి నింపింది.

ఇక ఏజెన్సీ చట్టాల ప్రకారం గ్రామసభ తీర్మానానికి అత్యంత ప్రాధాన్యత ఉంది. అయితే వాటన్నింటినీ బేఖాతరు చేస్తూ ప్రజాప్రతినిధులు ముందుకెళ్తుంటే చట్టరీత్యా సరికాదని చెప్పాల్సిన జిల్లా అధికారులు సైతం వారికి వంతపాడటం చర్చనీయాంశమైంది. ఆయుధ డిపో వంకావారిగూడెం పంచాయతీ పరిధిలో ఏర్పాటైతే ఉపాధి దక్కేది చాలా స్వల్పమే. ఆ ప్రాంత అభివృద్ధి కూడా మాటలకే తప్ప కార్యరూపంలో కన్పించదనేది వాస్తవం. ఈ రీత్యా ఏజెన్సీ ప్రజల ఆశలు, ఆకాంక్షలకు భిన్నంగా వెళ్లేకంటే చింతలపూడి నియోజకవర్గంలో పెద్దల చేతిలో ఉన్న ప్రభుత్వ భూముల్లో ఆయుధ డిపో పెట్టుకోవడం మంచిదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. నిజంగా గిరిజనుల, గిరిజన ప్రాంత అభివృద్ధిపై ఎంపీ, ఎంఎల్‌ఎకు చిత్తశుద్ధి ఉంటే ఐటిడిఎ ద్వారా గిరిజనులను ఉపాధి కల్పన, అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టవచ్చు. అయితే గిరిజన దినోత్సవం సందర్భంగా మినహా ఇప్పటి వరకూ మిగిలిన సందర్భాల్లో ఆయా ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు సైతం ఐటిడిఎ వైపు కన్నెత్తి చూసిన దాఖలాల్లేవు. అడవి బిడ్డలపై అంత మమకారం ఉంటే రెడ్డిగణపవరం వద్ద కాజ్‌వే స్థానంలో వంతెన నిర్మాణం లేక తాత్కాలికంగానైనా ఆ కాజ్‌వేను పునర్నిర్మించడమో చేయాలి. అలాగే ఏజెన్సీలో గిరిజన ఆశ్రమ పాఠశాలలు, వైద్యశాలల పరిస్థితి అందరికీ తెలిసిందే. వసతులు లేక విద్యార్థులు అవస్థలు పడుతుంటే, వైద్య శాలల్లో కొన్నింటిలో వసతులున్నా వైద్యులు, సిబ్బంది లేక ఆదివాసీలు ప్రాణాలు కోల్పోతున్నారు. ఈ ప్రాథమిక అంశాలపై దృష్టి పెట్టకుండా ఆదివాసీల అభ్యున్నతి కోసమే ఆయుధ డిపో అంటే గిరిజనులు నమ్మే పరిస్థితి లేదు. ఎందుకంటే పోలవరం నిర్వాసితుల పరిస్థితి అందరికీ కళ్ల ముందు కట్టినట్లు కన్పిస్తోంది. పరిహారం, పునరావాసం రెండింటిలోనూ నిర్వాసితులైన గిరిజనులకు నేటికీ న్యాయం జరగని పరిస్థితి. వాళ్లకు ముందు న్యాయం చేసి ఆపై ఆయుధ డిపో ఏర్పాటుపై చర్చిస్తే మంచిదని పలువురు పరిశీలకులు సైతం పాలకులకు, అధికారులకు సూచిస్తున్నారు.

అల్లూరి జిల్లాలోని పోలవరం నిర్వాసితులకు పునరావాసం, భూమికి భూమి ఇచ్చేందుకు బుట్టాయగూడెం, జీలుగుమిల్లి మండలాల్లో భూసేకరణ చేస్తున్నారు. అదీ వివాదాల్లో ఉన్న భూములను గిరిజనేతర భూస్వాముల పేరున రికార్డుల్లో చూపి వారికి సొమ్ము దక్కేటట్లు అధికారులు పావులు కదుపుతుండటం, దానిపై ఎంపీ, ఎంఎల్‌ఎ నోరు మెదపకపోవడం అంతా తెలిసే జరుగుతుందనేది అర్థమవుతోంది. ఇప్పటికైనా వారు ఏజెన్సీ చట్టాలకు భిన్నంగా గిరిజనులకు దక్కాల్సిన భూములను గిరిజనేతర భూస్వాముల నుంచి భూసేకరణ పేరుతో సేకరిస్తే కచ్చితంగా గిరిజనులకు అన్యాయం చేసిన వారవుతారని అంతా ఘంటాపథంగా చెబుతున్నారు. నిజంగా గిరిజనుల, గిరిజన ప్రాంత అభివృద్ధిపై ప్రేమ ఉంటే పోలవరం నిర్వాసితులకు చట్టప్రకారం పరిహారం, పునరావాసం కల్పించడంతోపాటు భూసేకరణలో అక్రమాలను అరికట్టాలని అంతా కోరుతున్నారు.

ఇక మెడికల్ కళాశాలల ప్రయివేటీకరణ అంశం పశ్చిమలో చర్చనీయాంశమైంది. ఒక్కగానొక్క మెడికల్ కళాశాల పాలకొల్లు సమీపంలోని దగ్గులూరులో నిర్మాణ దశలో ఉంది. పిపిపి పద్ధతిలో ఇది చేపడితే ప్రభుత్వ పెద్దలు చెబుతున్నట్లు 31 ఏళ్ల వరకూ ప్రయివేటు యాజమాన్యం చేతిలో ఉంటుంది. తర్వాత రాజెవరో, బంటెవరో అన్నట్లు అప్పటి నిర్ణయాలు ఎలా ఉంటాయో ఊహించనక్కర్లేదు. అంటే వైద్య విద్య మన జిల్లాలో అందుబాటులోకొచ్చినా పేద, మధ్యతరగతి ప్రజలకు అందని ద్రాక్షగా మిగులుతుందనడంలో ఎటువంటి సందేహమూ లేదు. దీనిపై ప్రజాసంఘాలు, వామపక్షాలు, ప్రధానంగా సిపిఎం వివిధ రూపాల్లో ఆందోళనలు నిర్వహిస్తోంది. కలెక్టరేట్‌పై వివాదానికి కారకులైన నేతలుగాని, తన నియోజకవర్గంలో చేపడుతున్న మెడికల్ కళాశాల ప్రయివేటీకరణపై అక్కడి మంత్రి నిమ్మల రామానాయుడుగాని ఇప్పటి వరకూ స్పందించలేదు. ఇప్పటికైనా ఆయా పాలకులు స్పందించి మెడికల్ కళాశాలను ప్రభుత్వ అధీనంలోనే నిర్మించి నిర్వహించాలని జిల్లావాసులంతా ముక్తకంఠంతో కోరుతున్నారు. లేనిపక్షంలో అటు ఆయుధ డిపో ఏర్పాటు, ఇటు మెడికల్ కళాశాల ప్రయివేటీకరణపై జిల్లావాసుల్లో నెలకొన్న అలజడి ఆందోళనరూపంలోకి మారితే కచ్చితంగా కూటమి ప్రభుత్వానికి నష్టమేనని రాజకీయ పరిశీలకులు విశ్లేషిస్తున్నారు.

-వియస్ఎస్‌వి.ప్రసాద్, ఏలూరు

బస్సులు ప్లాట్‌ఫారం వద్ద నిలపాలి

ప్రయాణికుల వేడుకోలు

ప్రజాశక్తి - గణపవరం

దూరంగా నిలిపిన ఆర్‌టిసి బస్సు

గణపవరం బస్టాండులోకి వచ్చిన బస్సులు ప్లాట్‌ఫారం వద్ద ఆపకుండా దూరంగా ఆపటం వల్ల ప్రయాణీకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఉచిత బస్సు ఏర్పాటు చేసిన తరువాత మహిళలు ఎక్కువ సంఖ్యలో ప్రయాణిస్తున్నారు. బస్సు పాయింట్ వద్ద ఆపకపోవటం వల్ల వృద్ధులు, పిల్లలు బస్సు ఎక్కేటప్పుడు పడిపోతున్నారు. ఉచిత బస్సు కావటం వల్ల కూర్చోవడానికి సీట్లు దొరకవని బస్సు ఎక్కడానికి మహిళలు ప్లాట్‌ఫారం దిగి వెళ్లేటప్పుడు పడిపోతున్నారు. బస్సులు ప్లాటుఫారం వద్ద నిలిపే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. లేకపోతే వృద్ధులు, పిల్లలకు ప్రాణాపాయం కలిగే అవకాశాలు ఉన్నాయని ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు బస్సులు ప్లాట్‌ఫారం వద్ద నిలిపే విధంగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. దీంతోపాటు బస్సు సర్వీసులు పెంచకపోవటం వల్ల ప్రయాణీకులు గంటల కొద్ది బస్టాండులో బస్సు కోసం ఎదురుచూడకుండా సర్వీసులు పెంచాలని కోరుతున్నారు.

పారిశుధ్యం మెరుగుకు చర్యలు

మున్సిపల్ కమిషనర్ ఎం. అంజయ్య

నరసాపురం : పట్టణంలో పారిశుధ్య పరిస్థితులు మెరుగుపరిచేందుకు తక్షణమే తగిన చర్యలు చేపట్టాలని నరసాపురం మున్సిపల్ కమిషనర్ ఎం. అంజయ్య సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. శనివారం ఆయన పట్టణంలోని పలు ప్రాంతాలలో పారిశుధ్య పనులు నిర్వహిస్తున్న సిబ్బంది మస్తర్లను తనిఖీ చేశారు. అనంతరం పట్టణంలోని 25వ వార్డు వైఎస్ఆర్ కాలనీలో పర్యటించి డ్రెయిన్ల పూడిక తొలగింపు పనులను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సానిటరీ మేస్త్రీలు, సిబ్బంది పాల్గొన్నారు.

పరిశ్రమల యజమానులకు అవగాహనా సదస్సు

వీరవాసరం : సెంట్రల్ గవర్నమెంట్ వరల్డ్ బ్యాంకు, రాష్ట్ర ప్రభుత్వం వారి సహకారంతో ఫైనాన్స్ ఇంక్లూషన్ సంయుక్తంగా వివిధ రకాల ఉత్పత్తుల పరిశ్రమల యాజమానులకు శనివారం అవగాహనా సదస్సు నిర్వహించారు. జిల్లా ఫెసిలిటేటర్ పోతుమూడి శేషారత్నం అధ్యక్షతన వీరవాసరం మహిళా మండల సమాఖ్య అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ప్రభుత్వం నుండి అందించే ప్రోత్సాహకాలను వివరించారు. జీరో డిఫెక్ట్, జీరో ఎఫెక్ట్ పేరుతో భారత ప్రభుత్వం ఒక సర్టిఫికేషన్‌తో స్వచ్ఛంద పథకం అమలు చేస్తున్నారన్నారు. తద్వారా నాణ్యమైన ఉత్పత్తులు తయారు చేయడం, వ్యర్థాలను తగ్గించడం, శక్తిని ఆదా చేయడం ద్వారా పర్యావరణాన్ని కాపాడుకోవచ్చున్నారు. ఈ కార్యక్రమంలో సర్కిల్ ఏడిసి శిరీష మంగతాయారు, ఎంపిడిఓ గుల్లిపల్లి విజయలక్ష్మి, ఫీల్డ్ ఇన్‌స్పెక్టర్ పి.సతీష్, ఎపిఎం ధీమంతి పాల్గొన్నారు.

స్వర్ణాంధ్రలో యన్‌త్రోత్సవ్

నరసాపురం : సీతారామపురం స్వర్ణాంధ్ర ఇంజనీరింగ్ కళాశాలలో యన్‌త్రోత్సవ్ మెకానికల్ ఇంజనీరింగ్ డిపార్ట్‌మెంట్ వారు నిర్వహించారు. వివిధ కళాశాలల నుండి పోస్టర్ పేపర్ ప్రెజెంటేషన్, టెక్నికల్ ఈవెంట్స్, రోబో ఎక్స్‌పో, మిస్టర్ మెకానిక్, చెస్, వివిధ నాన్ టెక్నికల్ ఈవెంట్స్ నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎస్‌ఆర్‌కెఆర్ ఇంజనీరింగ్ కాలేజీ మెకానికల్ డిపార్ట్‌మెంట్ ప్రొఫెసర్ డాక్టర్ కె.బ్రహ్మారాజు విచ్చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఛైర్మన్ కెవి.సత్యనారాయణ, ట్రెజరర్ కె.వెంకటేశ్వరస్వామి, డైరెక్టర్ అడ్లల శ్రీహరి, ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.సురేష్‌కుమార్, వైస్ ప్రిన్సిపల్ ఎ.గోపీచంద్ పాల్గొన్నారు.

ముగిసిన ఎస్ఎంఎస్‌వి-ఐటిఇ 2వ అంతర్జాతీయ సదస్సు

తాడేపల్లిగూడెం : సోషియల్ అండ్ సస్టైనబుల్ ఇన్నోవేషన్స్ ఇన్ టెక్నాలజీ అండ్ ఇంజనీరింగ్ పై 2వ అంతర్జాతీయ సదస్సు ముగింపు కార్యక్రమం శనివారం శశి ఇంజనీరింగ్ కళాశాలలో విజయవంతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శశి విద్యాసంస్థల ఛైర్మన్ బూరుగుపల్లి వేణు గోపాలకృష్ణ మాట్లాడుతూ రెండు రోజుల పాటు సాగిన ఈ సదస్సులో విద్యార్థులు, అధ్యాపకులు, పరిశోధకులకు ప్రపంచ స్థాయి ఆవిష్కరణలు, సామాజిక ప్రభావం కలిగిన పరిశోధనలపై ప్రపంచ నిపుణులు పాల్గొని సుస్థిర సాంకేతిక పరిజ్ఞానం, సామాజిక అవిష్కరణలపై విలువైన ఆలోచనలను పంచుకున్నారన్నారు. ఇలాంటి కాన్ఫరెన్స్ కార్యక్రమాలు భవిష్యత్తులో మరిన్ని నిర్వహిస్తామని తెలిపారు. కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ మోహమ్మద్ ఇస్మాయిల్ మాట్లాడుతూ ఈ సదస్సులో వివిధ సాంకేతిక సెషన్లు, కీలక వక్తల ఉపన్యాసాలు, పేపర్ ప్రెజెంటేషన్లు సదస్సుకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయన్నారు. ఈ సదస్సులో పాల్గొన్న పరిశోధకుల ప్రతిభావంతమైన పత్రాలను స్ప్రింగర్ నేచర్ పబ్లికేషన్ భాగస్వామ్యంతో ప్రచురించబడనున్నాయని కన్వీనర్ మంతెన శిరీష తెలిపారు. ఈ సమావేశంలో అతిథులు మాట్లాడుతూ ఈ సదస్సు ద్వారా విద్యార్థులు, అధ్యాపకులు, పరిశోధకులకు గ్లోబల్ స్థాయి అవగాహన కలిగిందని, సైట్ విద్యాసంస్థ ఇలాంటి అంతర్జాతీయ సదస్సులు నిర్వహించడం గొప్ప ముందడుగని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ఛైర్మన్ మేఘ నరేంద్ర కృష్ణ, నిర్వాహక కమిటీ సభ్యులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

శ్రీవాసవి జిఎంఆర్ జూనియర్ కళాశాలలో ఫ్రెషర్స్ డే

తాడేపల్లిగూడెం : లక్ష్యసాధనలో విద్యార్థులు నిరంతరం కృషిచేయాలని కళాశాల ఛైర్మన్ గ్రంధి సత్యనారాయణ సూచించారు. స్థానిక శ్రీవాసవి జిఎంఆర్ జూనియర్ కళాశాలలో శనివారం ఫ్రెషర్స్ డే కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపల్ ఎస్.సత్యనారాయణ తెలిపారు. కళాశాల సెక్రెటరీ అండ్ కరస్పాండెంట్ వివిఎస్ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ తమ కళాశాలలో తక్కువ ఫీజులతో కార్పొరేట్ విద్యను అందిస్తున్నట్లు తెలిపారు. డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ వివిఎస్ శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యార్థులు సమయాన్ని సద్వినియోగం చేసుకొని అవకాశాలను అందిపుచ్చుకోవాలని సూచించారు. పలు సాంస్కృతిక కార్యక్రమాల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. గత సంవత్సరం కళాశాల టాపర్స్‌గా నిలిచిన విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

కాళ్లకూరు వెంకన్న ఆలయం కిటకిట

క్యూలో ఉన్న యాత్రికులు

కాళ్ల : శ్రీకృష్ణ శరన్నవరాత్రి మహోత్సవాల సందర్భంగా కాళ్లకూరు వెంకటేశ్వరస్వామి ఆలయం యాత్రికులతో శనివారం కిటకిటలాడింది. భీమవరానికి చెందిన అల్లూరి పద్మరాజు, పద్మ దంపతులు, ఏలూరుపాడు గ్రామానికి చెందిన సంకా హరిచంద్ర వెంకట ప్రసాద్, రామసీత దంపతుల ఆర్థిక సహకారంతో ధనలక్ష్మి అమ్మవారి అలంకరణ నిర్వహించారు. పెద్దఎత్తున యాత్రికులు కాళ్లకూరు వెంకన్నను దర్శించుకున్నారు. వివిధ మండలాల నుంచి దర్శించుకునేందుకు పెద్దఎత్తున తరలివచ్చారు. పాదయాత్రగా తరలివచ్చిన యాత్రికులకు ఆలయ అధికారులు దర్శనం ఏర్పాట్లు, అన్న ప్రసాదం ఏర్పాట్లు చేసినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి ఎం.అరుణ్ కుమార్ తెలిపారు. ఈ దసరా ఉత్సవాలు అక్టోబర్ రెండో తేదీ వరకు జరుగుతాయన్నారు.

9 సబ్సిడీ గ్యాస్ సిలిండర్లు స్వాధీనం

తణుకు : తణుకు పట్టణంలో వాణిజ్య అవసరాలకు సబ్సిడీ గ్యాస్ సిలిండర్లు వాడుతున్నట్లు వచ్చిన సమాచారం ప్రకారం తనిఖీలు నిర్వహించారు. ఏలూరు రీజినల్ విజిలెన్స్, ఎన్ఫోర్స్‌మెంట్ అధికారి పి.మహేష్ ఆదేశాల మేరకు శనివారం తణుకు పట్టణంలో జిఎంఆర్ సిద్దేశ్వర్ కిరణా షాపు తనిఖీ చేయగా 9 గృహ అవసరాల గ్యాస్(సబ్సిడీ గ్యాస్) సిలిండర్లు గుర్తించినట్లు విజిలెన్స్ ఎస్ఐ కె.సీతారామ తెలియజేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ సీతారామ మాట్లాడుతూ.. సమాచారం తెలిసి కిరణా షాపు యజమాని గుడివాడ వాసవి దుర్గారామ వెంకటనరసింహ గుప్తాను ప్రశ్నించగా ఆయన వ్యాపార నిమిత్తం వాణిజ్య గ్యాస్ సిలిండర్లకు బదులుగా గృహ అవసరాల గ్యాస్ సిలిండర్లు వాడుతున్నట్లు తెలిపారన్నారు. ఈ తనిఖీలో రూ.26,002 విలువైన 9 గృహ అవసరాల గ్యాస్(సబ్సిడీ గ్యాస్) సిలిండర్లు సీజ్ చేసి, కిరణా షాపు యజమానిపై నిత్యావసర వస్తువుల చట్టం 1955 ప్రకారం కేసు నమోదు చేసినట్లు తెలియజేశారు. ఈ తనిఖీల్లో విజిలెన్స్ అగ్రికల్చర్ ఆఫీసర్ జి.మీరయ్య, తహశీల్దార్ బి.కన్యాకుమారి, తణుకు సిఎస్‌డిటి ఎన్.శ్రీదేవి, పట్టణ రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

కాళ్లలో అత్యధిక వర్షపాతం నమోదు

కాళ్ల : జిల్లా వ్యాప్తంగా గడచిన 24 గంటల వ్యవధిలో 47 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైనట్లు వాతావరణ శాఖ అధికారులు శనివారం తెలిపారు. జిల్లాలో అత్యధికంగా కాళ్ల 7.6, పెంటపాడు 4.6, ఇరగవరం 3.6, తణుకు 3.2 మిల్లీమీటర్ల చొప్పున వర్షపాతం నమోదైంది. జిల్లాలో పాలకొల్లు, మొగల్తూరు, ఆచంట, యలమంచిలి మండలాల్లో వర్షపాతం నమోదు కాలేదని వెల్లడించారు.

ప్రజాశక్తి
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈ క్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్కులేషన్ వివరాల కోసం
సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్కులేషన్ వివరాల కోసం
సెల్: 83339 88814

అలనాటి జ్ఞాపకాలు నెమరువేసుకుంటూ..

ఘనంగా ఎంవిఆర్ పాఠశాల పూర్వ విద్యార్థుల సిల్వర్ జూబ్లీ వేడుక

ప్రజాశక్తి - ఆచంట

ఎంవిఆర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల 2000-2001 విద్యార్థుల బ్యాచ్

జీవితంలో కొన్ని క్షణాలు ఎప్పటికీ మరువలేనివి. చిన్ననాటి స్నేహాలు, గురువుల బోధనలు, స్కూల్ ఆవరణలో ఆడిన ఆటలు, కలిసి రాసిన పరీక్షలు ఇవన్నీ జీవితాంతం మన హృదయంలో ముద్రవేస్తాయి. అలాంటి ఆ అనుభూతులను మళ్లీ పునరావృతం చేసుకునే రోజు వచ్చింది. ఆచంటలోని ఎంవిఆర్ ప్రభుత్వ హైస్కూల్ 2000-2001 బ్యాచ్ విద్యార్థులు తమ 25 ఏళ్ల సిల్వర్ జూబ్లీని అత్యంత ఘనంగా జరుపుకున్నారు. ఆచంటలోని ఎంవిఆర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదివిన విద్యార్థులు మద్దుల వీర వెంకట సుబ్రమణ్యం ఆధ్వర్యాన ఈ వేడుక శనివారం స్థానిక ఛాంబర్ ఆఫ్ కామర్స్ కళ్యాణ మండపంలో జరిగింది. 25 సంవత్సరాల క్రితం ఒకే తరగతి గదిలో కలసి కూర్చున్న వారు ఇప్పుడు వైద్యులు, ఇంజనీర్లు, ఉపాధ్యాయులు, వ్యాపారవేత్తలు, రైతులు, ఉద్యోగులు, ఇంకా ఎన్నో రంగాల్లో స్థిరపడి ఉన్నారు. ఎవరి వృత్తి జీవితం ఎంత బిజీగా ఉన్నా పాత స్నేహబంధం మాత్రం తగ్గలేదు. ఆ బంధమే వారిని ఈరోజు మళ్లీ ఒకచోట చేర్చింది.

గురువులకు సత్కారం..

ఈ వేడుకలో గురువుల సత్కారం ప్రత్యేక ఆకర్షణ. విద్యార్థులు తమ భవిష్యత్తును తీర్చిదిద్దిన ఉపాధ్యాయులను వేదికపై ఘనంగా సన్మానించారు. అప్పట్లో ఉపాధ్యాయులుగా పనిచేసిన ప్రస్తుత భీమవరం ఉప విద్యాశాఖాధికారి నార్గన రమేష్, ఆచంట మండల విద్యాశాఖాధికారి శ్రీనివాస్, పోడూరు మండల విద్యాశాఖాధికారి విజయకుమార్, ఎల్.శ్రీనివాస్, కొలిశెట్టి వీర వెంకట తాతారావులను ఘనంగా సన్మానించారు. 'మా విజయాల వెనుక గురువుల ఆశీస్సులే కారణం' అని విద్యార్థులు ఒకే స్వరంతో అన్నారు. ఈ సందర్భంగా ప్రతి ఒక్కరూ తమ స్కూల్ రోజుల మధురానుభవాలను పంచుకుంటూ.. నవ్వులు పూయించారు. 25 ఏళ్ల క్రితం ఏర్పడిన స్నేహం ఇప్పటికీ అలాగే కొనసాగడం విశేషం. ఎంవిఆర్ ప్రభుత్వ హై స్కూల్ 2000-2001 బ్యాచ్ సిల్వర్ జూబిలీ వేడుకలు ఆచంటలో చిరస్మరణీయంగా నిలిచిపోతాయన్నారు. ఈ వేడుకలు కొత్త తరం విద్యార్థులకు ప్రేరణగా నిలిచి, పాఠశాల అభివృద్ధికి పునాది వేయబోతున్నాయి. ఉభయ రాష్ట్రాల నుండి అధిక సంఖ్యలో హాజరై తమ సంతోషాలను పంచుకున్నారు.

ఎలుకల నివారణతోనే అధిక దిగుబడులు

మండల వ్యవసాయాధికారి పి.రమేష్ నాయుడు

ప్రజాశక్తి - కాళ్ల

సామూహిక ఎలుకల నిర్మూలన కార్యక్రమంలో రైతులందరూ భాగస్వాములై తమ పంటలను ఎలుకల బారినుంచి కాపాడుకోవాలని మండల వ్యవసాయాధికారి పి.రమేష్ నాయుడు అన్నారు. దొడ్డనపూడి గ్రామంలో సామూహిక ఎలుకల నివారణ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. మండల వ్యవసాయాధికారి పి.రమేష్ నాయుడు మాట్లాడుతూ ముందుగా వ్యవసాయ శాఖ ద్వారా అందించిన బ్రోమోడయోలిన్ మందును నూనెతో కలిపిన నూకలను తీసుకొని విషపు ఎరను తయారు చేసుకోవాలని తెలిపారు. ముఖ్యంగా పొలాల్లో ఎలుకల కన్నాలను ముందుగా గుర్తించి, వాటిని మట్టితో కప్పి ఉంచడం జరిగిందన్నారు. మరుసటి రోజు తెరుచుకున్న కన్నాలను బతికున్న ఎలుకలు ఉన్న కన్నాలుగా గుర్తించి వాటి వద్ద బ్రోమోడయోలిన్ మందు పొట్లాలను పెట్టడం ద్వారా ఎలుకల ఉధృతి తగ్గించవచ్చని సూచించారు. ఈ సందర్భంగా బ్రోమోడయోలిన్ విషపు ఎర గల పొట్లాలను రైతులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు ఆరేటి వెంకట్ రత్నప్రసాద్, కాళ్ల సొసైటీ డైరెక్టర్ కొల్లి వాసు, గ్రామ రైతులు ఆరేటికృష్ణ, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

పెనుమంట్రలో..

పౌష్టికాహారంతోనే ఆరోగ్యం

పలుచోట్ల స్వస్త్ నారీ స్వశక్త్ పరివార్ అభియాన్

ప్రజాశక్తి - ఉండి

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో అంగన్వాడీ చిన్నారులకు అందజేసే పౌష్టికాహారం తీసుకోవడం వల్ల చిన్నారులు సంపూర్ణ ఆరోగ్యంతో ఉంటారని రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ పేరిచర్ల సుభాష్ రాజు అన్నారు. శనివారం మండలంలోని కోలమూరులో నిర్వహించిన స్వస్త్ నారీ స్వశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ మహిళలు సంపూర్ణ ఆరోగ్యంతో ఉంటే కుటుంబం బాగుంటుందని పిఎం మోడీ జన్మదిన పక్షోత్సవాలలో భాగంగా మహిళలకు అవసరమైన వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచిత మందులు అందించడం జరుగుతుందని అన్నారు. అనంతరం అంగన్వాడీలో చిన్నారులకు పోషకాహారం అందజేశారు. కార్యక్రమంలో యండగండి పిహెచ్‌సి సిబ్బంది, అంగన్వాడీలు పాల్గొన్నారు.

గణపవరం : వైద్యుల సలహా మేరకు అందరూ వైద్యపరీక్షలు చేయించుకొని వ్యాధులు రాకుండా ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని గణపవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిహెచ్‌ఓ జాలాది విల్సన్ బాబు అన్నారు. శనివారం గణపవరం రెండవ సచివాలయంలో జరిగిన స్వస్త్ నారీ స్వశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో డాక్టర్ ఓంకార్ నాద్ మాట్లాడుతూ అక్టోబర్ రెండవ తేదీ వరకు ఆసుపత్రి పరిధిలోగల గ్రామాల్లో వైద్యశిబిరాలు ఏర్పాటు చేసి ప్రజలకు ఉచిత వైద్యపరీక్షలు నిర్వహిస్తామని చెప్పారు. శిబిరంలో 235 మందికి వైద్యపరీక్షలు చేసి మందులందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

పెనుమంట్ర : మండలంలోని పెనుమంట్ర ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, నెలమూరు గ్రామంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లలో శనివారం స్వస్త్ నారీ స్వశక్త్ పరివార్ అభియాన్ శిబిరాలు జరిగాయి. పిహెచ్‌సి వైద్యాధికారులు డాక్టర్ వి.అనిల్‌కుమార్(ఆలమూరు), డాక్టర్ సత్తి సంతోష్ రెడ్డి, డాక్టర్ టి.కిరణ్మయి(పెనుమంట్ర) మహిళలకు, కౌమార బాలికలకు వైద్య పరీక్షలు చేసి అవసరమైన మందుల అందించారు. ఈ రెండు శిబిరాల్లో సుమారు 390 మందికి కేన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు చేశారు. కార్యక్రమంలో కూటమి నాయకులు వెలగల బుల్లి రామిరెడ్డి, కోయ వెంకట కార్తీక్, పెనుమంట్ర గ్రామ ఉప సర్పంచి భూపతిరాజు శ్రీనివాసరాజు, నెలమూరు సర్పంచి కుచ్చర్లపాటి మంగతాయారు, ఎంపిటిసి నాగరాజు లక్ష్మి పాల్గొన్నారు.

వెలి అవాస్తవం

తహశీల్దార్ కార్యాలయంలో మొరపెట్టుకున్న మరో గ్రూప్

పాలకోడేరు : తమ కులానికి చెందిన కొన్ని కుటుంబాలను తాము వెలివేసామని చెప్పడం పచ్చి అబద్ధమని అదే కులంలోని మరొక గ్రూప్ ఆరోపించింది. పెన్నడ అగ్రహారానికి చెందిన 15 కుటుంబాలను వెలివేసారంటూ ఒక గ్రూప్ శుక్రవారం ధర్నా చేయడం తెలిసిందే. అయితే ఇది అబద్ధమని, తమపై లేనిపోని ఆరోపణలు చేస్తూ కుల పెద్దల పరువు తీసారంటూ పాలకోడేరు తహశీల్దార్ కార్యాలయంలో పోలీస్ రెవెన్యూ, అధికారులతో శనివారం సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇద్దరు, ముగ్గురు స్వార్థపరుల ఆగడాలకు తాము అడ్డు వస్తున్నామనే సాకుతో లేనిపోని ఆరోపణలు చేస్తున్నారన్నారు. ఊర్లో లేనివారి సంతకాలు చేసి ఫిర్యాదులు చేస్తున్నారని ఆరోపించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ ఎన్‌బి.భారతి, ఎస్ఐ మంతెన రవి వర్మ, ఆర్ఐ రాఘవ మూర్తిరాజు, పంచాయతీ కార్యదర్శి వెంకటరాజుతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. దీనిపై స్టేట్మెంట్ తీసుకుని ఉన్నతాధికారులకు నివేదిక పంపించనున్నట్లు తెలిపారు

తమను వెలివేసిన వారిపై చర్యలు తీసుకోవాలి : ఆర్‌డిఓకి ఫిర్యాదు చేసిన మరొక గ్రూప్

తమను వెలివేసిన వారిపై చర్యలు తీసుకోవాలని పెన్నాడ గ్రామానికి చెందిన మరొక గ్రూప్ డిమాండ్ చేసింది. భీమవరం ఆర్‌డిఒ ప్రవీణ్ కుమార్ రెడ్డికి తమకు న్యాయం చేయాలంటూ ఫిర్యాదును అందజేసి సమస్యను వివరించారు. దీనిపై సమగ్ర విచారణ చేపట్టేందుకు పాలకోడేరు తహశీల్దార్‌కు, ఎస్ఐకు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు.

పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం

మున్సిపల్ కమిషనర్ ఎం.ఏసుబాబు

తాడేపల్లిగూడెం : పరిసరాల పరిశుభ్రత మన అందరి సామాజిక బాధ్యత అని మున్సిపల్ కమిషనర్ ఎం.ఏసుబాబు పిలుపునిచ్చారు. శనివారం స్థానిక కొండయ్య చెరువు వద్ద పరిసరాల పరిశుభ్రత కార్యక్రమం పాటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలని, చెత్తను రోడ్లపై వేయకుండా వేరు చేసి పారిశుధ్య కార్మికులకు అందించాలని సూచించారు. అనంతరం చెరువు చుట్టూ ఉన్న పిచ్చి మొక్కలు తొలగించారు. జనసేన పట్టణ అధ్యక్షులు వర్ధన పల్లి కాశీ, జనసేన నాయకులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

స్వర్ణాంధ్రలో విద్యార్థులకు ఓరియంటేషన్ ప్రోగ్రాం

ప్రజాశక్తి - నరసాపురం

కళాశాల ఛైర్మన్ కెవి.సత్యనారాయణకు పుష్పగుచ్ఛం అందిస్తున్న విద్యార్థులు

మండలంలోని సీతారాంపురం గ్రామంలోని స్వర్ణాంధ్ర ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలలో శనివారం ఎంసిఎ, ఎంబిఎ, బిసిఎ, బిబిఎ విద్యార్థులకు ఓరియంటేషన్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఛైర్మన్ కెవి.సత్యనారాయణ(కెవిఎస్) ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ విద్యార్థులు తమ తమ లక్ష్యాలను నిర్దేశించుకుని ఇష్టపడి చదివితే మంచి ఉద్యోగాలు సాధించవచ్చని అన్నారు. ట్రెజరర్ త్రినాథ్ మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివి మంచి భవిష్యత్తును సాధించాలన్నారు. కళాశాల డైరెక్టర్ శ్రీహరి మాట్లాడుతూ విద్యార్థులు శ్రద్ధగా చదివి తమ లక్ష్యాలను చేరుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.సురేష్‌కుమార్, వైస్ ప్రిన్సిపల్ గోపిచంద్, ఎంసిఎ విభాగాధిపతి ఎఎన్ఎల్.కుమార్, బిసిఎ విభాగాధిపతి రామచంద్ర రావు, బిబిఎ విభాగాధిపతి డాక్టర్ శ్రీదేవి, ఎంబిఎ విభాగాధిపతి ఇన్‌ఛార్జి డాక్టర్ ఎన్‌జిఎస్.ప్రసాద్, విద్యార్థులు పాల్గొన్నారు.

పర్యావరణాన్ని పరిరక్షించాలి : ఎస్ఐ

ప్రజాశక్తి - ఆచంట

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటడం మన కర్తవ్యమని ఆచంట ఎస్ఐ కె.వెంకటరమణ అన్నారు. జిల్లా మానవతా పర్యావరణ పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో జంగారెడ్డిగూడెం గ్రామానికి చెందిన దాత దల్లి రామాంజనేయ రెడ్డి పంపిణీ చేసిన 124 మొక్కలు ఆచంట మానవతా మండల శాఖ పరిధిలో నాటారు. రామేశ్వరస్వామి ఆలయం వెనుక, పిరమిడ్, ధ్యాన కేంద్రం, ఎంఇఒ కార్యాలయం వద్ద, అయ్యప్ప స్వామి గుడి వెనుక, స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణలో మామిడి, జామ, సీతాఫలం, ఉసిరి, నేరేడు, మద్ది, రావి, సీమచింత, మర్రి తదితర మొక్కలను ఆచంట ఎస్ఐ కె.వెంకటరమణ, పర్యావరణ పరిరక్షణ కమిటీ ఛైర్మన్ కుక్కల లీలా ప్రసాద్ మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఎస్ఐ వెంకటరమణ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ మన కర్తవ్యమన్నారు. ప్లాస్టిక్ క్యారీ బ్యాగులు వాడకం ద్వారా ప్రజలకు కేన్సర్ లాంటి వ్యాధులతోపాటు పర్యావరణ పరిరక్షణకు విఘాతం కలుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మానవత ఆచంట మండల శాఖ అధ్యక్షులు సజ్జా నారాయణ, జిల్లా ఆడిట్ కమిటీ మెంబర్ నెక్కంటి శివన్నారాయణ, డైరెక్టర్స్ బోర్డు ఛైర్మన్ వేంద్ర శ్రీనివాస్, కన్వీనర్ కొమ్మన పెద్ది సూర్య నారాయణ మూర్తి శర్మ, అడ్వైజరీ డైరెక్టర్ నెక్కంటి హేమలత, కార్యదర్శి గుండాబత్తుల ఆనంద్ కుమార్, కోశాధికారి మడిచర్ల సతీష్ పాల్గొన్నారు.

గణపవరం : గణపవరం డిగ్రీ కాలేజీలో శనివారం ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రిన్సిపల్ పి.నిర్మలాకుమారి అధ్యక్షత వహించారు. సమావేశంలో పాల్గొన్న వైస్ ప్రిన్సిపల్ కె.స్వరూపరాణి మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా పర్యాటక రంగానికి విశేష ఆదరణ ఉందని అన్నారు. లెక్చరర్లు జివి.వెంకటరమణ, షేక్ పర్వీన్ షేక్ అన్సారీ పాల్గొన్నారు.

రేపటి నుంచి పారిశుధ్య కార్మికుల సమ్మె

ఎఐటియుసి జిల్లా అధ్యక్షుడు కోనాల భీమారావు

ప్రజాశక్తి - తణుకు

తణుకు జిల్లా కేంద్ర ప్రభుత్వాసుపత్రిలో పనిచేస్తున్న కాంట్రాక్టు పారిశుధ్య కార్మికుల 4 నెలల వేతన బకాయిలు, 40 నెలల పిఎఫ్ బకాయిలు తక్షణమే చెల్లించాలని ఈనెల 29వ తేదీ నుండి విధులు బహిష్కరించి సమ్మెలో పాల్గొంటున్నట్టు ఎపి మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ తణుకు అధ్యక్షుడు, ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు కోనాల భీమారావు తెలిపారు. ఈమేరకు ఎపి మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో శనివారం తణుకు జిల్లా కేంద్ర ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సాయికిరణ్‌కు సమ్మె నోటీసును అందజేశారు. ఈ సందర్భంగా భీమారావు మాట్లాడుతూ.. తణుకు జిల్లా కేంద్ర ప్రభుత్వాసుపత్రి 150 పడకల స్థాయి కనుగుణంగా కనీసం ఏభై మందికి తగ్గకుండా పారిశుధ్య కార్మికులను నియమించి కార్మికుల పనిభారం తొలగించాలన్నారు. ఆసుపత్రి పారిశుధ్య కార్మికులకు ఇస్తున్న అతి తక్కువ వేతనాలు నెలానెలా సక్రమంగా ఇవ్వకపోవడంతో పస్తులతో విధులు నిర్వహిస్తున్నారన్నారు. పిఎఫ్ సొమ్ము సైతం కార్మికుల పిఎఫ్ ఖాతాలకు జమచేయడం లేదన్నారు. 150 పడకల స్థాయి కనుగుణంగా పారిశుధ్య కార్మికులు లేక తీవ్ర పనిభారంతో కార్మికులు అనారోగ్యాల పాలవుతున్నారన్నారు. తక్షణమే ఆసుపత్రి పారిశుధ్య కార్మికులకు నాలుగు నెలల వేతన బకాయిలు చెల్లించి, వారి న్యాయమైన డిమాండ్స్ పరిష్కరించాలని భీమారావు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మెడికల్ ఎంప్లాయీస్ అండ్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ నాయకులు ధర్మాని పుష్పలత, భారతి, సిహెచ్.మంగమ్మ, పి.విజయలక్ష్మి, మెండి శ్రీను, వెంకటలక్ష్మి, ఎం.బేబి, ఇ.హైమావతి, డి.శ్రీనువాసు, చింతాలు, డి.దంబుర్ పాల్గొన్నారు.

200 రోజులు పనిదినాలు కల్పించాలి

వ్యకాస జిల్లా సహాయ కార్యదర్శి బళ్లచిన్న వీరభద్రరావు

జెండాను ఆవిష్కరిస్తున్న వీరభద్రరావు

కాళ్ల : ఉపాధి హామీ చట్టంలో 200 రోజులు పని కల్పించాలని, రూ.600 వేతనం ఇవ్వాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బళ్ల చిన్న వీరభద్రరావు డిమాండ్ చేశారు. వ్యవసాయ కార్మిక సంఘం మండల మహాసభ తిరుమాని శ్రీనివాస్ అధ్యక్షతన శనివారం నిర్వహించారు. సంఘం జెండాను జిల్లా సహాయ కార్యదర్శి బళ్ల చిన్న వీరభద్రరావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బళ్ల చిన్న వీరభద్రరావు, శేషపు ఆశ్రియ్య పాల్గొని మాట్లాడుతూ ఉపాధి చట్టంలో 200 రోజులు పని కల్పించాలని, రూ.600 వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఉపాధి హామీలో నిధులు కొరత సృష్టిస్తూ ఉపాధి హామీ పథకానికి పొగ పెట్టి కూలీలను పనికి రాకుండా చేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే ఉపాధి లేక గ్రామీణ పేదలు అనేక ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారని, ఉపాధి హామీ చట్టానికి అనేక నిబంధనల పేరుతో పని ఒత్తిడి పెంచి కూలీలు తనంతట తానే పనికి రాకుండా ప్రభుత్వాలు చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రోజువారి జీవనం చాలా కష్టంగా మారిందని, కరెంటు ఛార్జీలు, గ్యాస్ ఇతర పెరిగిన వస్తువు ధరలతో అనేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం నూతన కమిటీ ఏర్పాటు చేశారు. కన్వీనర్ గా గండికోట వెంకటేశ్వరరావు, కోకన్వీనర్‌గా తిరుమల శ్రీనివాస్, కమిటీ సభ్యులుగా బొండాడ తేజశ్రీ, కంబాల జయంతి, చెన్నూరి కామేశ్వరి, వీరమల్లు భవానిలను ఎన్నుకున్నారు. ఈ మహాసభలో భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి మండా సూరిబాబు, సిఐటియు మండల కన్వీనర్ యిర్రింకి ఏడుకొండలు, ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్ల సంఘం నాయకులు దాసరి వెంకటేశ్వరరావు, ఆక్వా కార్మికుల జిల్లా కార్యదర్శి గొర్ల రామకృష్ణ పాల్గొన్నారు.

గీత కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జుత్తిగ నరసింహమూర్తి

తణుకు : గీత కార్మికులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఆంధ్రప్రదేశ్ కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జుత్తిగ నరసింహమూర్తి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం స్థానిక అమరవీరుల భవనంలో కామన మునిస్వామి అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సమావేశంలో నరసింహమూర్తి మాట్లాడుతూ.. టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే గీత కార్మికుల రాతలను మారుస్తామని నమ్మబలికి అధికారంలోకి వచ్చిన తరువాత గీత కార్మికులకు చుక్కలు చూపిస్తుందని విమర్శించారు. గీత వృత్తి వ్యాపారం కాదని, మద్యం వ్యాపారంతో కూడుకున్నదని, దీనివల్ల సంపన్నులు కోట్లలో డబ్బు సంపాదిస్తున్నారన్నారు. మద్యం వ్యాపారాన్ని ప్రభుత్వం కార్పొరేట్లకు లాభాలు వచ్చే విధంగా ప్రోత్సహిస్తుందని అన్నారు. సంపాదన కోసం మద్యం వ్యాపారాన్ని గ్రామాల్లో ఏరులై పారిస్తూ లక్షలాది మంది గీత కార్మికులతో చెలగాటం ఆడటం టిడిపి కూటమి ప్రభుత్వానికి మంచిది కాదన్నారు. గీత కులాలను ముక్కలు ముక్కలుగా చేసి కొందరు వారి అన్యాయులకు కుల పదవులు కట్టబెట్టారు తప్ప గీత కార్మికులకు చేసిందేమీ లేదని దుయ్యబట్టారు. సంఘం జిల్లా అధ్యక్షులు కామన మునిస్వామి మాట్లాడుతూ.. గీత వృత్తి ప్రమాదకరమైనదని, బతుకుదెరువు కోసం 70 అడుగుల తాటి చెట్లు ఎక్కుతున్న గీత కార్మికులను టిడిపి కూటమి ప్రభుత్వం కేవలం ఓటు బ్యాంకుగా చూడవద్దని అన్నారు. ప్రమాదంలో మరణించిన గీత కార్మిక కుటుంబాలకు రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా, వికలాంగులైన వారికి రూ.10 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షులు బొక్కా చంటి, కడలి పాండు, మామిడిశెట్టి నాగభూషణం, శ్రీనివాసు, సూరిబాబు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు చేపట్టాలి

ఛైర్‌పర్సన్‌ను ప్రశ్నించిన కౌన్సిలర్లు

ప్రజాశక్తి - నరసాపురం

మరో రెండు మూడు నెలల్లో తమ పదవులు అయిపోతాయని, ఇప్పటికైన స్పందించి 31వ వార్డుల్లో అభివృద్ధి పనులు చేపట్టాలని టిడిపి కౌన్సిలర్ పాలూరి బాబ్జీ, వన్నెంరెడ్డి శ్రీను, పతివాడ పద్మ అన్నారు. శనివారం ఛైర్‌పర్సన్ బర్రె శ్రీవెంకటరమణ అధ్యక్షత జరిగిన సమావేశంలో వార్డుల్లో ఇప్పటి వరకు జరిగిన పనులపై సర్వే చేసి తక్కువ పనులు చేసే వార్డుల్లో మొదట ప్రాధాన్యత ఇవ్వాలని ఛైర్‌పర్సన్ వెంకటరమణను కోరారు. తమ వార్డుల్లోని చెరువులో చెత్త వేయడాన్ని అడిదల శ్యామల, వంగా శ్రీకాంత్, జిల్లెల్ల దిలీప్ వ్యతిరేకించారు. చెరువు పూడ్చి చెత్త వేయాలని ఏచట్టం చెప్పిందంటూ అధికారుల్ని ప్రశ్నించారు. దీనికి కౌన్సిలర్ కేసరి గంగరాజు, కోఆప్షన్ సభ్యులు వైకెఎస్‌లు మాట్లాడుతూ గతంలో చెరువు కాదని, ఒక దొడ్డి మాత్రమేనని చెప్పారు. చెత్త ఎక్కడ వేస్తామన్నది స్పష్టంగా చెప్పాలని అధికారుల్ని నిలదీశారు. దీనికి ఛైర్‌పర్సన్ వెంకటరమణ మాట్లాడుతూ తాత్కాలికంగానే చెత్త వేస్తామని, అది కూడా కొద్దిరోజులు మాత్రమేనన్నారు. పురపాలకం కొనుగోలు చేసిన స్థలంలోనే డంపింగ్ యార్డ్ ఏర్పాటు చేస్తామని చెప్పడంతో సభ్యులు శాంతించారు. ఈనెలలో 1 నుంచి 6 వార్డుల్లో విప్ నాయకర్ పర్యటించి పలు అభివృద్ధి పనులు ప్రతిపాదించారు. ఆ పనుల పురోగతిపై వన్నెంరెడ్డి నిలదీశారు. తర్వాత అత్యవసర సమావేశం ఏర్పాటు చేసి పనులు చేపట్టాలన్నారు. ట్రాక్టర్ల మరమ్మత్తుల విషయంపై వీసీ కామన నాగిని, కావలి రామసీత, శ్యామల అభ్యంతరం తెలిపారు. తర్వాత ఈ అంశాన్ని రద్దు చేయాలని పట్టుబట్టారు. ఒకే సారి ఇన్ని ట్రాక్టర్లు రిపేర్లు రావడంపై పలు అనుమానాలు వస్తాయని వీసీ కొత్తపల్లి నాని సభ దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై స్వతంత్ర కౌన్సిలర్ కోటిపల్లి సురేష్ మాట్లాడుతూ గతంలో వేరే ట్రాక్టర్లు రావడం లేదని చెప్పి, ఇప్పుడు వద్దని చెప్పడం సరికాదన్నారు. దీంతో వైసిపి కౌన్సిలర్లు నాగిని, శ్యామాల, రామసీతల మధ్య తీవ్ర వాగ్వాదం చోటు చేసుకుంది. చివరికి ఈ అంశంపై మరో అజెండాలో తీసుకొస్తామని చెప్పడంతో వివాదం సద్దుమణిగింది. అనంతరం శానిటేషన్ పనులపై చర్చించారు.

పెండింగ్ డిఎలు విడుదల చేయాలి

రాష్ట్ర గ్రామ రెవెన్యూ ఉద్యోగుల సంఘం ప్రతినిధులు

పెనుమంట్ర : ఈ దసరా నాటికి ప్రభుత్వం నుండి బకాయిపడిన నాలుగు విడతల కరువు భత్యం(డిఎ) నుండి కనీసం రెండు విడతల డిఎ అయినా ప్రకటిస్తే బాగుండునని ఉద్యోగులు, పెన్షనర్లు ఎదురు చూస్తున్నారు. ఈమేరకు శనివారం ఇక్కడ రాష్ట్ర గ్రామ రెవెన్యూ ఉద్యోగుల సంఘం ప్రతినిధులు భూపతిరాజు రవీంద్రరాజు, ఎం.అప్పలనాయుడు, జిల్లా పెన్షనర్ల సంఘం ప్రతినిధి పాలా ప్రసాద్ తదితరులు వేర్వేరు ప్రకటనలు చేస్తూ ప్రభుత్వం నుండి డిఎ ప్రకటన విడుదల పట్ల తమ ఆశాభావం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో పనిచేస్తున్న ఉద్యోగులందరూ గత ప్రభుత్వంలో రివర్స్ పిఆర్‌సి గురించి, ఉద్యోగులకు రావలసిన రూ.వేల కోట్ల బకాయిలు గురించి హామీ ఇచ్చినందున గత ఎన్నికల్లో కూటమి ప్రభుత్వానికి మద్దతిచ్చి, ఆ ప్రభుత్వం రావడానికి ఉద్యోగులు కృషిచేయడం జరిగిందని పేర్కొన్నారు. కానీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఉద్యోగులు ఐఆర్ ప్రకటిస్తారని ఎంతో ఆశపడ్డారు, కానీ ఇప్పటి వరకు ఐఆర్ సంగతి పక్కన పెడితే కనీసం నాలుగు పెండింగ్ డిఎలు ఉన్న ఇప్పటి వరకు సుమారు 20 క్యాబినెట్ సమావేశాలు జరిగితే ప్రతి క్యాబినెట్లో ఉద్యోగులకు సంబంధించి డిఎలు, ఐఆర్, పిఆర్‌సి కమిషన్, పెండింగ్ బకాయిలు గురించి చర్చిస్తారని ఉద్యోగులు ఎంతగానో ఎదురు చూశారని తెలియజేశారు. కానీ ఇప్పటివరకు ఉద్యోగులకు సంబంధించిన బకాయిలు గురించి కనీసం చర్చించకపోవడం పట్ల రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులందరూ ప్రభుత్వంపై తీవ్ర అసంతృతో ఉన్నారని, ఇప్పటికైనా ప్రకటించాలని పేర్కొన్నారు.

నల్సా 'జాగ్రితి' పథకంపై అవగాహన

నరసాపురం : నల్సా 'జాగ్రితి' పథకం(గ్రామీణ స్థాయిలో న్యాయ అవగాహన, సమాచార, పారదర్శకత)లో భాగంగా శనివారం చిట్టవరం గ్రామంలో చిరంజీవి కమ్యూనిటీ బిల్డింగ్‌లో న్యాయ సేవాధికార సంస్థ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నరసాపురం బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు వి.నాగేశ్వరరావు పాల్గొని మాట్లాడారు. న్యాయ సేవాధికార సంస్థ ద్వారా అన్ని తరగతుల వారికి అందించే న్యాయ సేవలు, పథకాలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే పథకాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. బార్ అసోసియేషన్ కార్యదర్శి వి.సూర్య ప్రకాశరావు లోక్ అదాలత్, ఉచిత న్యాయం గురించి వివరించారు. సర్పంచి తాడి లక్ష్మణరావు, చెన్నంశెట్టి నాగు, జాగృతి యూనిట్ సభ్యులు పాల్గొన్నారు.

నోటీసు

ప॥గో॥జిల్లా, నరసాపురం టౌన్
Sri Siddardha AutoConsultancy
174 of 2019 (రిజిస్టర్డ్ ఫర్మ్)
ను రద్దు చేయుచున్నాము. అభ్యంతరాలు ఉన్నచో 15 రోజుల లోపు తెలుపవలెను.

మేనేజింగ్ పార్టనర్
90635 95155
99481 89240

పాస్‌పోర్ట్ పోయినది

పశ్చిమగోదావరి జిల్లా, పెనుమంట్ర మండలం, జుత్తిగ గ్రామానికి చెందిన **కొప్పనాతి లక్ష్మి**, W/o. రాంబాబు అను నేను తెలుపుకొనేది. నేను స్వంత పని నిమిత్తం ది. 20-09-2025 శనివారం నాడు ఆలమూరు గ్రామం నుండి ఆటోలో వస్తుండగా పాస్‌పోర్ట్, ఫోన్, నగదు ఉన్న నా హాండు బ్యాగ్ పడిపోయింది. నా యొక్క పాస్‌పోర్ట్ నెం: **S8822636** అయి ఉన్నది. ఈ పాస్‌పోర్ట్ దొరికినవారు ఈ క్రింది అడ్రసుకు తెలియజేయగలరు.

కొప్పనాతి లక్ష్మి,
W/o. రాంబాబు,
డోర్ నెం. 1-261/2,
పల్లిపాలెం, జుత్తిగ (Post),
పెనుమంట్ర (మం), ప॥గో॥ జిల్లా
సెల్ నెం: 99665 27121